## ప్రభాకర్‌రెడ్డిని గెలిపించండి

ఉప ఎన్నికల హామీల్లో 90 శాతం పూర్తి

ఫ్లోరైడ్ గోస తీర్చింది బీఆర్ఎస్ పార్టీనే

# మునుగోడు బాధ్యత నాది



మునుగోడులో సీఎం కేసీఆర్ సభకు హాజరైన జనం

- ఏడాదిన్నరలో డిండి ఎత్తిపోతలతో నీళ్లిస్తా
- కాంగ్రెస్‌కు ఓటేస్తే ఉన్న కరెంట్ పోతది
- రోజుకో పార్టీ మారేటోళ్లకు బుద్ధి చెప్పాలి
- ఉప ఎన్నికల చైతన్యాన్ని మరోసారి చూపెట్టాలి
- ఆలోచించి ఓటేయండి.. మునుగోడును కాపాడుకోండి
- మునుగోడు ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్
- ప్రజా ఆశీర్వద సభ గ్రాండ్ సక్సెస్

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్26(నమస్తే తెలంగాణ) : మునుగోడు బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా మంత్రి జగదీశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజా ఆశీర్వాద బహిరంగసభలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొన్నారు. సీఎం వచ్చే సరికి నియోజకవర్గ వ్యాప్తంగా వేలాదిగా తరలివచ్చిన ప్రజలతో సభ స్థలం కిక్కిరిసిపోయింది. మధ్యాహ్నం రెండు గంటల నుంచే సభా ప్రాంగణం నిండడం మొదలుకాగా సాయంత్రం ఆరు గంటల వరకు సీఎం కేసీఆర్ రాక కోసం ఎంతో ఓపికతో వేచి చూశారు. కేసీఆర్ ప్రసంగం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. విపక్షాలపై పదునైన విమర్శలు చేస్తూ... మునుగోడు అభివృద్ధి వివరిస్తూ... వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఆవశ్యకత గురించి దిశానిర్దేశం చేస్తూ సీఎం కేసీఆర్ ప్రసంగం కొనసాగింది. నల్లగొండ జిల్లా చైతన్యాన్ని, కమ్యూనిస్టు ఉద్యమ చైతన్యాన్ని, ఉప ఎన్నికల స్ఫూర్తిని మరోసారి ప్రదర్శించాలని కోరుతూ.... పనికిమాలిన, డబ్బు మదం, అహంకారంతో రోజుకో పార్టీ మారేటోళ్లకు బుద్ధి చెప్పాలని ప్రజలకు సీఎం కేసీఆర్ పిలుపునివ్వడం సభకు హైలెట్‌గా నిలిచింది. మంత్రి జగదీశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో సీఎం కేసీఆర్ ప్రసంగించారు.

### ఫ్లోరైడ్ గోస తీర్చింది బీఆర్ఎస్‌నే

మునుగోడులో ఫ్లోరైడ్ గోస తీర్చిన పార్టీ బీఆర్ఎస్‌నేని సీఎం కేసీఆర్ మరోసారి స్పష్టం చేశారు. 'అంతకు ముందు ఉన్న కాంగ్రెస్ 50, 60 సంవత్సరాలు పాలించినా... ఇక్కడ నడుములు వంగి పోయి సచ్చిపోయేదాకా చూసిరు తప్ప... ఫ్లోరైడ్ నివారణ చేయలే. బీజేపీ ప్రధాని మంత్రి అటల్ బీహార్ వాజ్‌పేయి ముందు ఇక్కడి నుంచి ఉద్యమకారులు అంశులస్వామి అనే పిల్లోడిని టేబుల్ మీద పండేసిన దానికి నివారణ దొరకలే. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినాకనే ఫ్లోరైడ్ నీళ్ల గోస ఏ విధంగా పోయిందో మీ అందరికి తెలుసు' అని కేసీఆర్ వివరించారు. 'బీఆర్ఎస్ గవర్నమెంట్ వచ్చి పదేళ్లయిన సందర్భంలో..ఎన్నికలు వస్తే..24 ఏళ్ల కిందట పత్తాలేని నాడు.. గొడగొడ ఏడ్చిన నాడు.. పంటలు ఎండిపోయిన నాడు... ఫ్లోరైడ్ తో నడుములు వంగిపోయిన నాడు.. ఎవ్వడూ పట్టించుకోలేదు ఇవ్వాళ మాట్లాడేటోళ్లంతా ఎక్కడ ఉన్నారో మీకు తెలుసు. ఆనాడు ఎక్కడెక్కడో ఉన్నోళ్లు... ఎవ్వళ్లెవ్వళ్ల బూట్లు మోసినోళ్లు... ఇయ్యాల నామీద చాలెంజ్ చేస్తుండ్రు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక నాడు ఫ్లోరైడ్ బాధ ఉంటే నేనే పాట రాసిన ఎమాయేనా నల్లగొండ ...ఎడుపే నీ గుండె నిండు అని చెప్పి ఆ రోజు చైతన్యం చేసే ప్రయత్నం చేసిన అని కేసీఆర్ మునుగోడు ప్రజలకు గుర్తు చేశారు.

### ఏడాదిన్నరలో శివన్నగూడేనికి నీళ్లిస్తా

ఏడాది, ఏడాదిన్నర కాలంలో డిండి ఎత్తిపోతల ద్వారా మునుగోడులో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చే బాధ్యత తనది సీఎం కేసీఆర్ మరోసారి స్పష్టం చేశారు. డిండి ఎత్తిపోతల గురించి ప్రస్తావిస్తూ... 'మీ అందరికీ తెలుసు పాలమూరు ఎత్తి పోతల పథకం పూర్తయితేనే. మన డిండికి, శివన్నగూడేనికి నీళ్లు వస్తయి. కాబట్టి నిన్న, మొన్ననే పాలమూరుకు క్లియరెన్స్ వస్తున్నయ్. కోర్టు కేసులు అన్ని పోతున్నయ్. కాబట్టి మన పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తయ్యే దశకు వచ్చింది. మొన్న ఒక పంపు నేనే స్టార్ట్ చేసిన. డిండి కాలువ ద్వారా శివన్నగూడెం రిజర్వాయర్ వరకు నీళ్లు తెచ్చే బాధ్యత నాది... ఇది కరువు ప్రాంతం కాబట్టి మిగిలిన పనులన్నీ కూడా పూర్తి చేసే బాధ్యత నేను తీసు కుంటున్న. వందకు వంద శాతం పనులు చేయించి, ఏడాది, ఏడాదిన్నర లోపే సుమారు రెండు లక్షల ఎకరాలకు మునుగోడు నియోజకవర్గంలో నీళ్లు తెచ్చే బాధ్యత నాదే అని' ప్రజలకు స్పష్టం చేశారు.

### నిబద్ధత ఉన్న వ్యక్తి ప్రభాకర్‌రెడ్డి

మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి నిబద్ధత కలిగిన వ్యక్తి అని, కచ్చితంగా గెలిపించుకోవాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. 'మిత్రుడు ప్రభాకర్ రెడ్డి ఉద్యమంలో మొదటి నుంచి ఉన్న వ్యక్తి... ఒక నిబద్ధత కలిగిన వ్యక్తి. ఆడంబరాలకు పోయే వాడు కాదు. 24 ఏండ్ల క్రితం ఉద్యమం మొదలుపెట్టిన నాటి నుంచి ప్రభాకర్‌రెడ్డి నా వెంట ఉన్నడు. ఉద్యమంలో జైలుకు కూడా పోయినడు. ఆప్పటి నుంచి మడమ తిప్పకుండ పోరాటం చేస్తున్నడు. మీరందరూ చూస్తున్నరు. తెలంగాణ ఉద్యమంలో ఎవరు మనతో ఉన్నరు. ఎవరు మనతో లేరు... మీరు కండ్లరా చూసినారు. ఇలాంటి వాటన్నింటినీ మీరు భేరీజు వేయ్యాలి..చెప్పిన మాట మీద, ఇచ్చిన మాట మీద, నిలబడి ఉండే వాళ్లు ఎవరు... మాట తప్పి పోయేవాళ్లు ఎవరో...మీరు ఆలోచించాలి. మొన్న ఉప ఎన్నికల్లో ఏ చైతన్యం చూపెట్టారో... ఏ ధన ప్రభావానికి అడ్డంగా మీరంతా నిలబడి గెలిపించినారో... అలాగే ఈ ఎన్నికల్లో కూడా మునుగోడు ప్రజలు కచ్చితంగా ప్రభాకర్‌రెడ్డినే గెలిపించాలి అని సీఎం కేసీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. తనకు అవకాశం లభిస్తే మరోసారి ప్రత్యేకంగా మునుగోడు చివరి దశలో వస్తానని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో సభలో హర్షద్వానాలు వ్యక్తమయ్యాయి.

### కాంగ్రెస్‌తో మళ్లా కరెంటు గోస....

'ప్రజలకు డెవెలప్‌మెంట్ కావాలి. సాగు నీళ్లు రావాలే. తాగు నీళ్లు కావాలే. 24 గంటల కరెంట్ రావాలే. మీ అందరికీ తెలుసు... యావత్తు భారతదేశంలో 24 గంటల కరెంట్ ఇచ్చే ఏకైక రాష్ట్రం తెలంగాణ. ప్రధాన మంత్రి రాష్ట్రంలో కూడా సాధ్యం కావడం లేదు. మీ అందరికీ కూడా తెలుసు. కర్ణాటకలో కూడా నిన్న కాక మొన్న అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ విధంగా వాగ్దానం చేసిందో... ఏ విధంగా కరెంటు కుప్పకూలిందో... 5 గంటలు కూడా కరంట్ ఇవ్వక పోతే... రైతులు రోడ్ల మీద పడి ధర్నాలు చేస్తున్నరు. కాని ఒక తెలంగాణలోనే మనం కరెంటు ఇవ్వగలుగుతున్నా. అందుకే కాంగ్రెసోళ్లు వస్తే ఇక్కడా కరెంటు గోస తప్పదని సీఎం కేసీఆర్ ప్రజలను హెచ్చరించారు. రైతులు అలాంటి పరిస్థితి తెచ్చుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

### మునుగోడు చైతన్యాన్ని చూపెట్టాలి

మునుగోడు రాజకీయ చైతన్యం ఉన్న ప్రాంతం. కమ్యూనిస్టు జెండాలు ఎగిరిన ప్రాంతం. కమ్యూనిస్టు ఎమ్మెల్యేలు ఉన్న ప్రాంతం. మీ చైతన్యం అనేది చూపెట్టాలి. ఎన్నికలనగానే పైసల్ పట్టుకొచ్చే బేహారీలు.. పూటకోక పార్టీ మార్చే బేహార్‌లు... ఏమైనా చేస్తారు.. మన్నలి ముంచుతారు. వాళ్లకు నియమం లేదు.. సిద్ధాంతం లేదు... నిబద్ధత అంటూ ఉండదు.. నిన్నొక పార్టీ..ఇయ్యాలో పార్టీ..రేపు ఒక పార్టీ...కేవలం డబ్బు మదంతోని, డబ్బు ఆహంకారంతోని, మేము ఏమైన చేయకల్గుతం, ప్రజలను కొనగలుగుతాం అనుకుంటరు. దయ చేసి మిమ్మల్ని కోరేది ఒక్కటే. నల్లగొండ చైతన్యాన్ని, కమ్యూనిస్టు ఉద్యమాల చైతన్యాన్ని మీరు కచ్చితంగా చూపెట్టాలి. ఇలాంటి వాళ్లకు బుద్ధి చెబితేనే రాజకీయాల్లో ప్రక్షాళన జరుగుతది. ప్రజలకు లాభం జరుగుతది అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. పరోక్షంగా కాంగ్రెస్ నుంచి బీజేపీ, ఇప్పుడు బీజేపీ నుంచి తిరిగి కాంగ్రెస్‌లో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గురించి ప్రస్తావిస్తూ ప్రజలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీనివాసగౌడ్, ఎమ్మెల్సీ మధుసూదనా చారి, ఎంపీ బడుగుల లింగయ్యాయాదవ్, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, కల్లు, గీతా కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి కుమార్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, మాజీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జెల్లా మార్కండేయులు, ఎంపీపీలు కర్నాటి స్వామి యాదవ్, పల్లె కల్యాణి, మెండు మోహన్ రెడ్డి, శ్వేతా రవీందర్ రెడ్డి, జడ్పీటీసీలు కర్నాటి వెంకటేశం, వీరమళ్ల భానుమతీ గౌడ్, పాశం సురేందర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర నేతలు వేమిరెడ్డి నర్సింహారెడ్డి, మునగాల నారాయణరావు, భవనం శ్రీనివాస్ రెడ్డి, దాడి శ్రీనివాస్ రెడ్డి, కర్నాటి శ్రీనివాస్ రచయిత మిట్టపల్లి సురేందర్, గాయకుడు సందీప్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అభివృద్ధి

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

'తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సీమాంధ్ర పాలకులపై కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నది. 2001 నుంచి తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి రాష్ట్రాన్ని సాధించారు. స్వరాష్ట్రంలో సాగు నీటి వనరులు పెంచి నేడు భరతదేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా మార్చారు. అత్యధిక ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్న మునుగోడు గోడు తీర్చేందుకు మిషన్ భగీరథను ప్రారంభించి ఇంటింటికీ నల్లా ద్వారా మంచినీటిని అందించి ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టారు. రానున్న రోజుల్లో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసి మునుగోడు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయనున్నారు. డబ్బుతో రాజకీయం చేసే వాళ్లను నమ్మకూడదు. మునుగోడు ఎమ్మెల్యేగా కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని మరోసారి గెలిపించి ఈ ప్రాంత అభివృద్ధి కోసం సహకరించాలి.'

## వెల్లువెత్తిన అభిమానం

చౌటుప్పల్,అక్టోబర్ 26 : మునుగోడులో గురువారం సాయంత్రం నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు మండలవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. సీఎం కేసీఆర్ ప్రసంగం విన్నేందుకు స్వచ్ఛందంగా బయల్దేరి వెళ్లారు. మండలవ్యాప్తంగా 13 వేల మంది ప్రజలు సుమారు 300 వాహనాల్లో వెళ్లినట్లు సమాచారం. యువకులు బైక్‌పై ర్యాలీగావెళ్లారు.

నాంపల్లి : మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు మునుగోడు ప్రజా ఆశీర్వాద సభకు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.



చౌటుప్పల్ : మందోళ్లగూడెం నుంచి బయల్దేరుతున్న బీఆర్ఎస్ శ్రేణులు



నాంపల్లి నుంచి తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు



నాంపల్లి : దామెరలో నుంచి సీఎం కేసీఆర్ సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు



మర్రిగూడ : ఎరగండ్లపల్లి నుంచి ఆశీర్వాద సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

### సీఎం కేసీఆర్ సభ సైడ్‌లైట్స్

మునుగోడు /సంస్థాన్ నారాయణ పురం :

- మునుగోడులో సాయంత్రం 5.51 గంటలకు హెలికాప్టర్‌లో సీఎం కేసీఆర్ సభ ప్రాంగణం చేరుకున్నారు.
- మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, కల్లు, గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ సీఎం హెలిప్యాడ్ వద్దకు వెళ్లి ఘన స్వాగతం పలికారు.
- 5.58 గంటలకు సీఎం కేసీఆర్ సభ వేదిక పైకి చేరుకున్నారు.
- 6 గంటలకు సీఎం కేసీఆర్ ప్రసంగం ప్రారంభించి 6.10 గంటలకు ముగించారు.
- గాయకులు మిట్టపల్లి సురేందర్,సందీప్ ధూం ధాం పాటలతో ప్రజలను ఉర్రూతులూగించారు.
- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి నృత్యం చేసి సభలో ఉత్సహాన్ని నింపారు.
- వాతావరణం అనుకూలించకపోవడంతో రోడ్డు మార్గంలో సీఎం కేసీఆర్ తిరుగు పయనమయ్యారు.
- తిరుగు ప్రయాణంలో సీఎం కేసీఆర్ కాన్వాయ్ నుంచి ప్రజలకు దారి పొడువున అభివాదం చేస్తూ వెళ్లారు.